# రేపటి నుంచి మహంకాళి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు

**● ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి**

బేగంపేట్ అక్టోబర్ 13: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. శుక్రవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవచ్చునని చెప్పారు. 15న అమ్మవారికి ప్రత్యేక అభిషేకం అనంతరం నవరాత్రి పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. 23న శ్రీచక్రార్చన కుంకుమ పూజలు సాయంత్రం ఊరేగింపు ఉంటాయన్నారు. నవరాత్రి పూజల సందర్భంగా ప్రతిరోజు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి పాల్గొన్న ధర్మకర్తలు

ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అలాగే 20న శ్రీ సరస్వతి దేవి అలంకారం సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 19న అక్షరభ్యాసం చేసుకునే వారు వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 15నుంచి 23వ తేదీ వరకు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, పండితులు పాల్గొన్నారు.

## 25న హమాలీ బస్తీలో బొడ్రాయి పూజలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 13 : పద్మారావునగర్‌లోని హమాలీబస్తీలో ఈ నెల 25న బొడ్రాయి పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ తెలపారు. ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. శుక్రవారం బస్తీవాసులతో ఆయన సమావేశమయ్యారు. కొంతకాలంగా బస్తీవాసుల పనులు కాకపోవడం, అవాంఛనీయ సంఘటనలు జరగడంతో స్థానికులు వేద పండితులను సంప్రదించారని, వారి సూచన మేరకు బస్తీలో బొడ్రాయిని నిలిపి పూజలు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. బస్తీవాసులు ఐకమత్యంగా ఉండాలని, రాబోయే రోజుల్లో అందరికీ మంచి జరగాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని, బస్తీవాసులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్ని విధాలుగా అండగా ఉంటారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు ఏసూరి మహేశ్, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండాలి

వెంగళరావునగర్, అక్టోబర్ 13: ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సమాచారం శరవేగంగా ఎల్లలు దాటుతుంది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లతో అర చేతిలో ప్రపంచం ప్రత్యక్షమవుతుంది. అయితే అరచేతిలో ప్రపంచం పై అప్రమత్తత అవసరమని రూమ్ టు రీడ్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం రూమ్ టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికల విద్య కార్యక్రమంలో భాగంగా జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద 'సైబర్ భద్రత–నా డిజిటల్ ప్రపంచం' అనే అంశం పై వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి విస్తృతంగా ఆటో క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. కంప్యూటర్ తో ప్రపంచం కుగ్రామంగా మారిందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బాలికల అక్షరాస్యత పెరుగుతుందని..బాలికలు సైబర్ మోసాలకు గురవకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



ప్రచారాన్ని ప్రారంభించిన రూమ్ టు రీడ్ ప్రతినిధులు

## జెక్‌కాలనీలో బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు



కరపత్రాన్ని విడుదల జేస్తున్న జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమీర్‌పేట్, అక్టోబర్ 13 : బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జెక్‌కాలనీ మహిళలు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జెక్‌కాలనీ రెసిడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న కాలనీలో వందలాది మహిళల భాగస్వామ్యంతో జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. ఇందుకు సంబంధించిన వివరాలను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్.అన్నపూర్ణ (దేవాదాయ శాఖ సహాయ కమిషనర్)లు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలను తొలి రోజున జెక్‌కాలనీ స్ట్రీట్ నెంబర్ 2లోని అనంతరెడ్డి బంగ్లా ఆవరణలో ప్రారంభమవుతాయని, ఆ తరువాత ప్రతి రోజు ఒక్కో స్ట్రీట్‌లో ఈ వేడుకల నిర్వహణకు ఆయా అపార్ట్‌మెంట్స్ నివాసితులతో కలిసి సన్నాహాలు పూర్తి చేశామన్నారు. వేడుకల చివరి రోజు 22న సాయంత్రం 6 గంటల నుంచి కాలనీలోని బతుకమ్మ చౌరస్తాలో (హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో) సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు సంప్రదాయ బతుకమ్మను అత్యుత్తమంగా తీర్చిదిద్దిన మొదటి అయిదు మందికి పట్టుచీరలను అందజేయడం జరుగుతుందని, దీంతో పాటు బతుకమ్మను తీసుకువచ్చిన ప్రతి మహిళకు కూడా ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని ప్రముఖ దేవాలయాలైన ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాలకు సుదీర్ఘకాలం పాటు ఈవోగా పని చేయడమే కాకుండా ఆయా దేవాలయాల ఆవరణలో జరిగే బతుకమ్మ వేడుకలను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసిన కాలనీకి చెందిన (దేవాదాయ సహాయ కమిషనర్) అన్నపూర్ణ సలహాలు సూచనలతో ఈ వేడుకలను గతంలో కంటే ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశామని బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ వెల్లడించారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు ఆదిలక్ష్మి దేవి, విరమణమ్మ, భాగ్యలత, విజయలక్ష్మి, పర్వతవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జూబ్లీహిల్స్,అక్టోబర్13: పద్దెనిమిదేండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని యూసుఫ్‌గూడ సర్కిల్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి హిమబిందు సూచించారు. అర్హులందరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 'స్వీప్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో 100 శాతం ఓటింగ్ సరళిని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులతో ఓటర్లను చైతన్య పరిచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు స్కిట్ పోటీలు నిర్వహించి స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పార్కులు, జనాలు ఉన్న ప్రాంతాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యూసీడీ పీవో హిమబిందు

## వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దు

బేగంపేట్ అక్టోబర్ 13: ఎన్నికల నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంలో తప్పులేదు కానీ..నిబంధనల పేరుతో వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. నగరానికి చెందిన స్వర్ణకారులే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడి బంగారం, వెండి అభరణాల వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారి పట్ల నిబంధనల వంకతో అధికారులు నిర్వహిస్తున్న తీరుతో వ్యాపారులు ఎంతో ఆందోళన, ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయకుండా వ్యవహరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక సమ్మేళనం



సంప్రదాయ దుస్తులతో ర్యాంప్ వాక్ చేసిన విద్యార్థులు



విద్యార్థులు తయారుచేసిన పిండి వంటలను పరిశీంచిన ప్రిన్సిపాల్ హేమలత

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 13 : పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో శుక్రవారం 'పరస్పర' పేరుతో సంప్రదాయ, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అమర్నాథ్ శర్మలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. భారతీయ జీవన విధానాలు, సంప్రదాయాలు ఎంతో గొప్పవని అన్నారు. తెలంగాణ సంస్కృతి, పండుగలు, పర్వదినాలు వాటి ఔన్నత్యం గురించి విద్యార్థులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్, స్వ యంగా తయారుచేసిన పిండి వంటకాల ప్రదర్శన, సంగీత కచేరి, వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తుల ధారణ, ఆటపాటలతో రోజంతా సందడిగా సాగింది. భారత సైన్యంలో ఉద్యోగాలు పొందిన కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులను అతిథులు అభినందించారు.

## చిన్నారులకు టీకాలు వేయించాలి

జూబ్లీహిల్స్,అక్టోబర్13: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా ఐదేండ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేసేందుకు వైద్యారోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు ఐఎంఐ మెగా టీకా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో ఏఎన్ఎం నాగవేణి, ఆశా వర్కర్ రాజమణితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారికి టీకాలను వేస్తున్నారు. శ్రీరాంనగర్ క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌లు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయిన 0–5 ఏండ్లలోపు చిన్నారులను.. నగరానికి పనుల కోసం వలస వచ్చే కుటుంబాలలో ఇప్పటికి టీకాలు వేయించకుండా ఉన్న పిల్లలను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ఐదేండ్లలోపు పిల్లల్లో ఒక్కరికి కూడా మిస్ కాకుండా టీకాలు వేస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు.



సర్వే చేస్తున్న ఏఎన్ఎం నాగవేణి, ఆశా వర్కర్ రాజమణి